క్లుప్తంగా

రోడ్డులో గుంతలతో ఇబ్బందులు



ఏర్పేడులో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఏర్పేడు: స్థానిక ఆంధ్రా బ్యాంకు ఎదురుగా ఆర్అండ్బీ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరులేన్ల రోడ్డు పనులకు మట్టిని తీసుకుని వెళ్లే భారీ వాహనాలు, లారీలు, బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో ఆంధ్రా బ్యాంకు ఎదురుగా మూడు నెలల క్రితం పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చకపోవడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు, లారీలు, బస్సులు గుంతల్లో దిగి మరమ్మతులకు గురవుతున్నాయి. ఆర్అండ్బీ అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

చేతిపంపునకు మరమ్మతులు చేపట్టండి



మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగలోని తెలుగుగంగ కార్యాలయం అవరణలో ఉన్న చేతిబోరు మరమ్మతులకు గురైంది. దీంతో అధికారులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి కోసం కిలోమీటరు దూరంలో బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకొంటున్నారు. వేలాది రూపాయలు ఖర్చుచేసి వేసిన చేతిపంపు నిరుపయోగంగా మారింది. చేతిపంపు మరమ్మతులకు గురై సంవత్సరం కావస్తున్నా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి చేతిపంపునకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

దుస్థితిలో బస్ షెల్టర్



మరమ్మతులకు గురైన బస్‌షెల్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కేటీ రోడ్డు పక్కన కాంపాళ్లెం గ్రామానికి వెళ్లే రోడ్డులో నిర్మించిన బస్ షెల్టర్ దుస్థితికి చేరుకుంది. దీన్ని 20 సంవత్సరాల క్రితం మాజీ ఎంపీ వెంకటస్వామి నిధులతో నిర్మించారు. బస్ షెల్టర్ గ్రామానికి దూరంగా ఉండటంతో లోపలున్న కిటికీలు, కిందపరచిన నాపరాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సంబంధిత అధికారులు స్పందించి బస్ షెల్టర్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పచ్చాలమ్మకు ప్రత్యేక పూజలు



పచ్చాలమ్మకు పూజలు చేస్తున్న పూజారి

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలో ఉన్న పచ్చాలమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

తిరుపతి తుడా: ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో 16వ తేదీ సోమవారం ×ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక్ష (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సోమవారం కార్యాలయానికి వినతులతో రావొద్దన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

తిరుపతి రూరల్(శ్రీనివాసమంగాపురం): శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం లక్ష్మి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న స్వామివారు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, అధికారులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైద్య రంగం నిర్వీర్యం



రాష్ట్రంలో వైద్య కళాశాలల నిర్మాణాన్ని చంద్రబాబునాయుడు అడ్డుకోవడం సరైందికాదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అన్ని వసతులతో గత ఏడాది ఐదు కళాశాలల్లో అడ్మిషన్లు చేపట్టారు. మిగిలిన వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. ఇందులో భాగంగానే మంత్రి సత్యకుమార్ యాదవ్ వైద్య కళాశాలల్లో తరగతి గదులు లేవని, బోధనా సిబ్బంది లేరని అబద్ధాలు చెప్పడం తగదు.

– కూనాటి రమణయ్య యాదవ్, ఏర్పేడు



కుంటి సాకులు తగదు



పెద్దయ్యాక ఏమవుతామని అడిగితే డాక్టర్ లేదా ఇంజినీర్ అని పిల్లలు సమాధానం ఇస్తారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రోత్సహించాలి. మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. కుంటి సాకులు చూపి వారిని చదువులకు దూరం చేయడం సరికాదు. పేదలకు వైద్య విద్యను అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో జగనన్న ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చింది. వాటిని కొనసాగించాలి. అంతేగాని వసతులు లేవని నెపం వేయడం బాధ్యత అనిపించుకోదు.

– శ్రీ కార్తీక, బైపీసీ విద్యార్థిని, నారాయణవనం

మద్యం దుకాణాల ఉద్యోగులకు ఎసరు

- అక్టోబరు 1 నుంచి అమల్లోకి కొత్త మద్యం పాలసీ
- ప్రభుత్వ దుకాణాల స్థానంలో తెరుచుకోనున్న ప్రైవేట్ షాపులు
- జిల్లాలో వీధిన పడనున్న 554 మంది సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, వాచ్‌మెన్ కుటుంబాలు



బుచ్చినాయుడుకండ్రిగలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో కొత్తగా ఉద్యోగాలు పొందిన వారికి ఎసరు పెడుతోంది. గత ప్రభుత్వంపై అక్కసుతో వారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటుండడంతో చిరుద్యోగుల్లో అభద్రతా భావం నెలకొంది. ఇప్పటికే వలంటీర్లకు వేతనాలు ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. పాఠశాలల్లోని పారిశుద్ధ్య కార్మికులు, ఆయాలకు సైతం నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా వేధిస్తోంది. అదే విధంగా ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్స్ తొలగిస్తూ, మహిళా సమాఖ్య సంఘమిత్ర లీడర్లను తొలగిస్తున్నారు. తాజాగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై పడింది. వారికి సకాలంలో జీతాలు చెల్లించలేదు. వారిని తొలగించేందుకు సిద్ధమైంది. వచ్చే నెలాఖరుకు ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేట్ దుకాణాలను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటోంది. దీంతో జిల్లాలోని 148 మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న 554 మంది సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, వాచ్‌మెన్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడనున్నారు.

ఆదాయ వనరుగా మద్యం అమ్మకాలు

2019కు ముందు వరకు నాటి టీడీపీ ప్రభుత్వం మద్యాన్ని ఓ ఆదాయ వనరుగా మాత్రమే చూసింది. టీడీపీ నేతలకు ఉపాధి కల్పించడం, వేల కోట్ల రూపాయలను ఆర్జించడమే లక్ష్యంగా ప్రయివేట్ దుకాణాలకు లైసెన్సులు జారీ చేసింది. అటు తర్వాత వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రైవేట్ దుకాణాల దందాకు కళ్లెం వేసి వాటి స్థానంలో ప్రభుత్వ దుకాణాలు తీసుకొచ్చింది. ఎమ్మార్పీ ధరకే మద్యం అందిస్తూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించింది. ఒక్కో దుకాణంలో ఒక సూపర్‌వైజర్‌తోపాటు ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మెన్, (కొన్నిచోట్ల ఇద్దరూ) చొప్పున నియమించింది. సూపర్‌వైజర్లకు నెలకు రూ.21,500, సేల్స్‌మెన్‌లకు రూ.18 వేలు, వాచ్‌మెన్లకు రూ.12 వేల చొప్పున వేతనాలు ఇస్తూ వచ్చింది. జిల్లాలోని 148 మద్యం దుకాణాల్లో పనిచేసే 554 మందికి ఉపాధి లభించింది. తాజాగా అక్టోబరు 1వ తేదీ నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకొస్తూ ఇప్పటికే నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో 554 కుటుంబాల పరిస్థితి రోడ్డున పడినట్టు అయింది. మద్యం దుకాణాల ప్రైవేట్ పరం చేయడం ప్రభుత్వ నిర్ణయానికి వదిలేసినా, ఇక్కడ పనిచేస్తున్న వందలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వ పెద్దలు సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

ఏదో ఒక చోట అవకాశం కల్పించాలి



మద్యం దుకాణాల్లో పనిచేసే మేము చాలా చిన్న ఉదోగ్యలం. మాకు రాజకీయ పార్టీలతో ఏ మాత్రం సంబంధం లేదు. వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. కొత్త మద్యం పాలసీ అమలు చేస్తే మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. కానీ మమ్మల్ని రోడ్డున పడేయకుండా ఏదో ఒక చోట సర్దుబాటు చేయాలని కోరుకుంటున్నాం.

– ఆనంద్, సూపర్‌వైజర్

మా పరిస్థితి అర్థం కావడం లేదు



ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకు రానుండంతో మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. మా పొట్ట కొట్టకుండా మమ్మల్ని ఏదో ఒకచోట సర్దుబాటు చేసి ఉపాధి కల్పించాలి. తద్వారా కుటుంబాలను పోషించుకునే స్థామత కల్పించాలని కోరుతున్నాం.

– వెంకటేశ్వర్లు, సేల్స్‌మన్

554 కుటుంబాలు వీధిన పడతాయి



ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ ప్రకారం ప్రైవేట్ మద్యం దుకాణాలను ఏర్పాటుచేయనుంది. ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడతాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 554ల మంది పనిచేస్తున్నాం. మమ్మల్ని తొలగిస్తే కుటుంబాలు వీధిన పడతాయి. ప్రభుత్వం మంచి మనసుతో ఆలోచించి మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

– రాజశేఖర్, సేల్స్‌మన్

ఘనంగా ఇంజినీర్స్ డే



రేణిగుంట సీఆర్ఎస్‌లో మాట్లాడుతున్న చీఫ్ వర్క్స్ మేనేజర్ దేవసహాయం

రేణిగుంట: రేణిగుంట సీఆర్ఎస్‌లో ఆదివారం ఇంజినీర్స్ డేను చీఫ్ ఆపరేషన్ మేనేజర్ దేవసహాయం అధ్యక్షతన ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలను కొనియాడారు. సీఆర్ఎస్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో రైల్వే రిటైర్డ్ ఇంజినీర్లను సన్మానించారు. రిటైర్డ్ సీఆర్ఎస్ ఇంజినీర్స్ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ ఇంజినీరుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య అనేక సేవలు చేశారని కొనియాడారు. ఆయన సాధించిన ఘనత ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం రిటైర్డ్ ఇంజినీర్లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ఉపాధ్యక్షుడు గజపతి నాయుడు, కార్యదర్శి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

శ్రీకాళహస్తి: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం తొట్టంబేడు మండలం శివనాథపురంలో ఉన్న అమ్మ ఆశ్రమంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు.

లగడపాటి సాహితీ సేవలు చిరస్మరణీయం



లగడపాటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రచయితలు

శ్రీకాళహస్తి: తెలుగు భాషా సాహిత్యానికి లగడపాటి భాస్కర్ చేస్తున్న సేవలు చిరస్మరణీయమని పలువురు కవులు, రచయితలు కొనియాడారు. ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళా వేదిక అధ్యక్షుడు, కవి, రచయిత లగడపాటి భాస్కర్ ప్రథమ వర్ధంతిని ఆదివారం వారి స్వగృహంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. వారి కుమార్తెలు కిరణ్మయి, కృష్ణశశి కవులు, రచయితలను సన్మానించారు. వారు మాట్లాడుతూ లగడపాటి భాస్కర్ సంస్మరణ సంచిక జనవరిలో తీసుకురావడంతో పాటు ప్రతియేటా ఇద్దరికి లగడపాటి సాహితీ పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గొడుగు చింత గోవిందయ్య, యువశ్రీ మురళి, తీగల వెంకటయ్య, గురునాథం, పెళ్లకూరు మునిసుబ్బారెడ్డి, రవీంద్ర, మోహన్‌నాయుడు, వెంకటస్వామి, చెంచుకృష్ణపిళ్లై, షణ్ముగం, మునస్వామి, బాలముని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



కూనాటి సురేష్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు

శ్రీకాళహస్తి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. అంధులైన విద్యార్థుల కోసం ఆడియో టేపులను తయారు చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్సీవీ కిరణ్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, రవినాయుడు, సుదర్శన్‌నాయుడు, పామాంజి సుబ్రమణ్యం, ఢిల్లీ ప్రతాప్, కిషోర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సావిత్రి



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు సావిత్రి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన సావిత్రి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందుకున్నారు. తిరుపతి విశ్వం విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డుల ప్రదానోత్సవం చేపట్టారు. కార్యక్రమానికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనమడు జి.సుబ్రమణ్యశర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఆయన చేతులమీదుగా ఉపాధ్యాయురాలు సావిత్రి అవార్డు అందుకున్నారు.

23.200 కేజీల గంజాయి స్వాధీనం

- రూ.50 వేల నగదు, కారు, సెల్‌ఫోన్లు కూడా
- ముగ్గురు నిందితుల అరెస్టు



నిందితులతో సీఐ, ఎస్ఐ, తహసీల్దారు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఆలత్తూరు క్రాస్ రోడ్డులో ఆదివారం 23.200 కేజీల గంజాయి, రూ.50 వేల నగదు, కారు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిమ్మయ్య తెలిపారు. ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎస్ఐ విశ్వనాథనాయుడుతో కలిసి ఆదివారం ఆలత్తూరు క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. శ్రీకాళహస్తి నుంచి వస్తున్న స్కార్పియోను నిలిపి పరిశీలించినట్టు తెలిపారు. అందులో ఉన్న ముగ్గురు కారు దిగి పారిపోయేందుకు ప్రయత్నించారని, వారిని వెంబడించి పట్టుకున్నామన్నారు. కారులో తనిఖీ చేయగా 23 కేజీల 200 గ్రాముల గంజాయి ప్యాకెట్స్ లభించాయన్నారు. వారిని అదుపులోకి తీసుకుని రూ.50 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు, స్కార్పియో కారును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. విచారణలో కలకడకు చెందిన మహబూబ్‌బాషా, ఒడిశాకు చెందిన క్షత్రియ, డీలిఫ్‌కెటాక్ ఒడిశా నుంచి గంజాయిని తెప్పించి తిరుపతి, తడ, శ్రీకాళహస్తిలో విక్రయిస్తున్నట్టు తేలిందన్నారు. గంజాయి విలువ సుమారు రూ.20 లక్షల పైనే ఉంటుందన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరనున్నట్టు తెలిపారు. రైటర్ నాగరాజు, కానిస్టేబుళ్లు, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తిరుపతి(అలిపిరి): టీటీడీలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఏపీ రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టీటీడీ ఈఓ జె.శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మంను కలిసి వినతిపత్రం అందించారు. టీటీడీలోని కల్యాణకట్ట, వివిధ శాఖలు, టీటీడీ ఇతర అనుబంధ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణ ఉద్యోగులు సమస్యలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు మేస్త్రి నుంచి సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందాలంటే 5 ఏళ్ల అర్హత కలిగి ఉండాలనే నిబంధన వల్ల చాలామంది నష్టపోతున్నారని తెలిపారు. దాన్ని 5 నుంచి 3 ఏళ్లకు తగ్గించాలని కోరారు. తిరుమలలోని ప్రధాన కల్యాణకట్ట, 11 మినీ కల్యాణకట్ట కాంప్లెక్స్‌లలో ఉద్యోగులకు స్నానాల గదులు, మరుగుదొడ్లు, విశ్రాంత గదులు ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతిలోని మ్యూజిక్, డ్యాన్స్ కళాశాలలో ఖాళీగా ఉన్న డోలు, నాదస్వరం, తాళం, శృతి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

ముక్కంటిని దర్శించుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్



ఆలయం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ దంపతులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, వేదపండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న షేక్ రషీద్

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన షేక్ రషీద్(35) ఆదివారం కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల కథనం మేరకు.. షేక్ రషీద్ చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబ కలహాల కారణంగా ఆదివారం తన ఎడమ చేతిని కోసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు, స్థానికులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పెద్దిరెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మిథున్‌రెడ్డికి సన్మానిస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని ఆదివారం తిరుపతిలో వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, జేసీఎస్ కన్వీనర్ వేలూరు రాకేష్, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు కలిశారు. వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా, పార్టీ రాజకీయ సలహా కమిటీ సభ్యుడిగా నియమితులైన పెద్దిరెడ్డిని అభినందించారు. తామంతా పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో భానుప్రకాష్‌రెడ్డి, మునిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, సాయినాయుడు, గురునాథం, గెడితొట్టి గురవయ్య, ప్రసాద్‌పాల్, జయచంద్రనాయుడు, అమరలింగయ్య, కిరణ్‌యాదవ్, ప్రసాద్, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



పెద్దిరెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న నాయకులు

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



పూజాసామగ్రి తీసుకువస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్య పూజల్లో జరిగే దోషాల పరిహారార్థం ఈ పూజలు చేస్తారు. ఆలయంలోని యాగశాలలో అర్చకులు శ్రీ–కాళ–హస్తి, భరద్వాజ మహర్షికి అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవర్లను ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గణపతి నిమజ్జనం

సత్యవేడు: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాల వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గంగమిట్టవీధి, శివాలయం వీధి, దేవాంగపురం వీధిలో మహిళలు సారె ఊరేగింపు నిర్వహించారు. స్వామికి వివిధ రకాల పిండి వంటలు సమర్పించారు. వాయిద్యాలతో యువతీ యువకులు డ్యాన్సు చేస్తూ, రంగులు చల్లుకుంటూ వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. మధ్యాహ్నం వినాయక మండపాల వద్ద అన్నదానం చేశారు.

ముగిసిన గణేష్ నిమజ్జనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గణేష్ నిమజ్జనాలు ముగిశాయి. 9 రోజులు పూర్తి కావటంతో పుత్తేరి, రెడ్డిగుంటబాడవ, పీవీకండ్రిగ, బీఎస్‌పురం, కుమ్మరవెంకటపురం గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలను వైభవంగా నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి, విగ్రహాలను పూలతో అలంకరించారు. అనంతరం వాహనాల్లో ఉంచి ఊరేగింపుగా తీసుకువెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



సత్యవేడు: గంగమిట్ట వీధి గణపతి ఊరేగింపు

వినాయకుడి లడ్డూ రూ.45 వేలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో వినాయకుడి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ రూ.45 వేలు పలికింది. ఆదివారం పాపానాయుడుపేట దాసరి యూత్ ఆధ్వర్యంలో లడ్డూను వేలం వేశారు. గ్రామానికి చెందిన చెంచుకృష్ణ లడ్డూను రూ.45 వేలకు దక్కించుకున్నాడు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. సాయంత్రం నిమజ్జనం చేశారు.



బుచ్చినాయుడుకండ్రిగ: పుత్తేరి గ్రామంలో..







ఏర్పేడు: వేలంలో దక్కించుకున్న లడ్డూతో చెంచుకృష్ణ, ఏర్పేడు: పాపానాయుడుపేటలో వినాయకుడి ఊరేగింపు, సత్యవేడు: దేవాంగపురంలో..